క్లుప్తంగా

హోరాహోరీగా ఫుట్‌బాల్ పోటీలు

కర్నూలు (టౌన్): నగర శివారులోని లక్ష్మీపురం వద్ద ఉన్న రిడ్జ్ పాఠశాలలో సీబీఎస్ఈ క్లస్టర్–7 ఉమ్మడి రాష్ట్రాల బాలుర ఫుట్‌బాల్ పోటీలు సోమవారం హోరాహోరీగా సాగాయి. అండర్–14 విభాగంలో ఎడిపై వరల్డ్ స్కూల్ అత్తాపూర్ జట్టు శ్లోకా ఏ బిర్లా స్కూల్, నల్గొండ జట్టుపై విజయం సాధించింది. అండర్–17 విభాగంలో నెల్లూరుకు చెందిన రెయిన్‌బో స్కూల్, హైదరాబాదు శ్రీస్వామి నారాయణ గురుకుల విద్యాలయ జట్టుపై గెలుపొందింది. ఇదే విభాగంలో హైదరాబాద్‌కు చెందిన సిల్వర్ ఆక్స్ టక్ డెల్ క్యాంపస్ స్కూల్ జట్టుపై రిడ్జ్ స్కూల్ విజయం సాధించింది. అండర్–19 విభాగంలో విశాఖపట్నంకు చెందిన కాకతీయ పబ్లిక్ స్కూల్, రంగారెడ్డి జిల్లాకు చెందిన ఇండస్ యూనివర్సల్ స్కూల్, హైదరాబాదుకు చెందిన చిన్మయ విద్యాలయ జట్లు విజయం సాధించినట్లు పాఠశాల సీఈఓ గోపినాథ్ స్పష్టం చేశారు. క్రీడా కార్యదర్శి రాజేంద్ర, గ్లోబల్ స్కూల్ సీఈఓ వంశీధర్ పాల్గొన్నారు.

పోస్టర్ విడుదల

కర్నూలు సిటీ: పీడీఎస్‌యూ 50 వసంతాల సభ పోస్టర్‌ను సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఆవిష్కరించారు. ఆ సంఘం నాయకులు సోమశేఖర్, షాహీద్, బాలాజీ, కిరణ్, వంశీ, హరి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ.. అందరికీ విద్య, సమాన, నాణ్యమైన విద్య కోసం పీడీఎస్‌యూ పోరాటాలు చేస్తుందన్నారు.

అథ్లెటిక్స్‌లో సత్తా చాటాలి

కర్నూలు (టౌన్): వ్యక్తిగత క్రీడాంశాల్లో సత్తా చాటాలని స్పోర్ట్స్ ప్రమోటర్ జి.శ్రీధర్‌రెడ్డి సూచించారు. స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో సోమవారం ఎస్‌జీఎఫ్ అండర్–19 విభాగంలో అథ్లెటిక్స్ పోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఎస్‌జీఎఫ్ క్రీడల్లో ప్రతిభ చాటి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. క్రీడాభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి హర్షవర్ధన్, ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

సేవా తత్పరత కలిగి ఉండాలి



చిన్మయ మిషన్ కేంద్రం రెండో అంతస్తును ప్రారంభిస్తున్న పి.సుబ్బారెడ్డి

కర్నూలు కల్చరల్: ప్రతిఒక్కరూ సామాజిక సేవా తత్పరత కలిగి ఉండాలని జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ పి.సుబ్బారెడ్డి అన్నారు. సోమవారం వీఆర్ కాలనీలోని చిన్మయ మిషన్ కేంద్రం చిన్మయ ప్రభావళి భవనంలో ఆధునీకరించిన సెకండ్ ఫ్లోర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన సంస్కృతి సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందిచే ఆధ్యాత్మిక కేంద్రాలకు అందరి సహాయ సహకారాలు అవసరం అన్నారు. అతిథి పి.నరసింహారెడ్డి మాట్లాడుతూ భవనం ఆధునీకరణకు సుబ్బారెడ్డి రూ.25 లక్షలు అందజేసి దాతృత్వాన్ని చాటుకున్నారన్నారు. చిన్మయ మిషన్ బాధ్యులు స్వామిని సుప్రేమానంద మాట్లాడారు. కాంట్రాక్టర్ దామోదర్‌రెడ్డి, రెడ్ల సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖలో పదోన్నతులు

కర్నూలు న్యూసిటీ: ఆదోని డివిజన్–3లో ఏఈఈగా విధులు నిర్వహిస్తున్న సంతోష్‌కు డీఈఈగా పదోన్నతి కల్పిస్తూ ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అతనికి పోస్టింగ్ ఇవ్వాల్సి ఉంది. అలాగే విధుల్లో నిర్లక్ష్యంతో సస్పెన్షన్‌కు గురైన డీఈఈ నాగేంద్రప్రసాద్‌కు ఉపశమనం కలిగింది. ఈ మేరకు ఆయన్ను తిరిగి విధుల్లో చేరాలని సీఎండీ ఉత్తర్వులు జారీ చేశారు. ఆలూరు సబ్‌డివిజన్‌లో విధులు నిర్వర్తిస్తూ సస్పెన్షన్‌కు గురైన డీఈఈను ఎమ్మిగనూరు సబ్ డివిజన్‌లో విధుల్లో చేరాల్సిందిగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఫార్మసిస్టుల సమస్యలపై సమీక్ష

కర్నూలు(హాస్పిటల్): ఫార్మసిస్టు అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, కర్నూలు డిస్ట్రిక్ట్ సభ్యుల సమావేశంలో ఫార్మసిస్టుల సమస్యల గురించి సమీక్షించారు. సోమవారం స్థానిక శరీన్‌నగర్‌లోని అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో నూతన కార్యవర్గ సమావేశం, భవిష్యత్ కార్యాచరణ విషయాలతో పాటు ఫార్మసిస్టుల సమస్యలు, సర్టిఫికెట్ రెంటల్ నిర్మూలన, ఫార్మసీ ఎగ్జిట్ ఎగ్జామ్, ఫార్మసీ నూతన ఎగ్జిట్ ఎగ్జామినేషన్ విధి విధానాల గురించి చర్చించారు. ఫార్మసీ సర్టిఫికెట్ రెంటల్‌కు ఇవ్వడం వల్ల కలిగే అనర్థాలు, సమస్యల గురించి కమిటీ సభ్యులు నిషాద్ వివరించారు. సభ్యులు పాల్గొన్నారు.

స్వచ్ఛతలో భాగస్వాములు కావాలి

కర్నూలు న్యూసిటీ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛతే సేవా కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని, పరిసరాల శుభ్రతకు అంకితభావంతో కృషి చేయాలని శక్తిసదన్ సూపరింటెండెంట్ విజయకుమారి పిలుపునిచ్చారు. శాంతి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నగరంలోని శరీన్‌నగర్ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నడిచే శక్తి సదన్‌లో ఉండే మహిళలు సోమవారం స్వచ్ఛతే సేవా కార్యక్రమంలో భాగంగా ప్రాంగణంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు.

సమస్యల పరిష్కారానికి పోరాటం

కర్నూలు(సెంట్రల్):సమస్యల పరిష్కారం కోసం పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ పిలుపునిచ్చారు. సోమవారం సీపీఎం కల్లూరు, ముజఫర్‌నగర్ మహిళా శాఖల మహాసభలు జరిగాయి. ఆయా మహాసభలకు సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, కార్యవర్గ సభ్యురాలు పి.నిర్మల, ఐద్వా జిల్లా కార్యదర్శి అలివేలు, నగర కార్యదర్శి టి.రాముడు హాజరై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. స్థానిక సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. పరిష్కారం లభించకపోతే పోరాటాలకు సిద్ధం కావాలని సూచించారు.

అవ్వాతాతలకు ఆదరణ ఏదీ !

- ప్రభుత్వ ఆసుపత్రుల్లో కనిపించని ప్రత్యేక క్యూలు
- అందరితో పాటు క్యూలో నిలబడి నీరసం
- నిలబడలేక కుప్పకూలిపోతున్న వృద్ధులు
- కుటుంబసభ్యులు ఎత్తుకుని ఓపీకి వెళ్లాల్సిన పరిస్థితి
- జిల్లాలో ప్రతి నెలా 40 వేల మందికి పైగా వృద్ధులకు చికిత్స
- నేడు అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం

కర్నూలు(హాస్పిటల్): వృద్ధాప్యం ఏ ఒక్కరికీ శాపం కాకూడదు. వారికి ఆదరణ ఉండాలి. అభిమానం చూపించాలి. మేమున్నామనే భరోసానివ్వాలి. అప్పుడే వారు ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా జీవనం గడపగలుగుతారు. అయితే ప్రస్తుత సమాజంలో పరిస్థితి భిన్నంగా ఉంది. ఇంట్లో పనులు చేసుకునే వృద్ధులుంటే ఫరవాలేదు. ఏ పనీ చేతగాకపోతే వారిని అనాథ శరణాలయాలు లేదా బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్లు, ప్రభుత్వ ఆసుపత్రుల పాల్జేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో దాతలు పెట్టింది తింటూ జీవిత చరమాంకంలో రోజులు లెక్కపెడుతున్నారు. మరికొందరు ప్రభుత్వ ఆసుపత్రుల్లో చూసుకునే వారు లేక ఒంటరి జీవితాన్ని గడుపుతున్నారు. ఇలాంటి వారి కోసం ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేయాల్సి ఉన్నా ఎక్కడా అమలు కావడం లేదు. నేడు అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం పురస్కరించుకుని ప్రత్యేక కథనం.

కేంద్ర ప్రభుత్వం 2011లో మినిస్ట్రీ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్‌లో భాగంగా నేషనల్ ప్రోగ్రాం ఫర్ హెల్త్ కేర్ ఆఫ్ ఎల్డర్లీ(ఎన్‌పీహెచ్‌సీఈ)ని రూపొందించింది. ఇందులో భాగంగా వృద్ధులకు ప్రత్యేక ఓపీ అమలు చేయాలి. వారికి ప్రత్యేక వార్డు కేటాయించాలి. పునారావాస కేంద్రాలను ఏర్పాటు చేయాలి. అవసరమైతే వైద్య సిబ్బంది ఇంటి వద్దకే వెళ్లి వైద్యం అందించాలి. అయితే ఇవేవీ జిల్లాలో సరిగ్గా అమలు కావడం లేదు. అందరితో పాటు వీరికీ వైద్యం అందిస్తున్నారు. కుటుంబసభ్యులు తోడుగా వస్తే వైద్యుల వద్దకు తీసుకెళ్లి చికిత్స చేయిస్తున్నారు. ఎవ్వరూ లేకపోతే అన్నీ తిప్పలే.

జిల్లాలో గత ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో 60 ఏళ్లకు పైబడిన వారు కేవలం 3,55,045 మంది చికిత్స పొందారు. గతేడాది ఇదే సమయానికి ప్రత్యేక ఓపీలు నిర్వహించడం వల్ల 14 లక్షలకు పైగా వృద్ధులు వైద్యం పొందారు. ప్రస్తుతం అందరితో పాటే వారికి ఆయా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తున్నారు. గతంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా ఇంటికే వెళ్లి చికిత్స అందించే వారు. ఇప్పుడా ఆ పరిస్థితి లేదు. నామమాత్రంగా వైద్యసేవలు అందిస్తున్నారు.

ప్రస్తుతం జిల్లా మొత్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రతి నెలా కేవలం వెయ్యి మందికి మాత్రమే అడ్మిషన్ కల్పిస్తున్నారు. అలాగే 600 నుంచి 700 వరకు రిహాబిలిటేషన్, ఇంటి వద్దకు వెళ్లి 1,500 మంది వరకు వైద్యం అందిస్తున్నారు. ఇప్పటివరకు అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో 333 మంది చికిత్స పొందుతూ మరణించినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఈ గణాంకాల్లో మార్చి, ఏప్రిల్ నెలలకు సంబంధించి ఒకే విధమైన అంకెలు వేయడం గమనార్హం. క్షేత్రస్థాయిలో సిబ్బంది పనిచేయడం లేదో ఉద్యోగుల పొరపాటో తెలియదు గానీ ప్రభుత్వానికి సైతం ఇదే విధంగా సిబ్బంది లెక్కలు పంపిస్తున్నారు.



వృద్ధుడికి వైద్యపరీక్షలు చేస్తున్న సిబ్బంది

జనవరి నుంచి ఆగస్టు వరకు చికిత్స పొందిన వారు

నెల	ఏరియా ఆసుపత్రి	సీహెచ్‌సీ	పీహెచ్‌సీ	యూపీహెచ్‌సీ	మొత్తం
జనవరి	2,686	2,136	29,587	8,484	42,893
ఫిబ్రవరి	2,665	2,156	34,995	9,305	49,121
మార్చి	2,291	1,114	30,795	8,698	42,989
ఏప్రిల్	2,291	1,114	30,795	8,698	42,898
మే	2,438	1,877	30,637	10,264	45,216
జూన్	2,553	1,254	29,622	10,303	43,733
జులై	987	1,714	29,558	10,075	42,334
ఆగస్టు	1,518	1,262	33,534	9,638	45,952

వృద్ధాప్యంలో వచ్చే వ్యాధులు

మతిమరుపు, కీళ్లవాపులు, కీళ్లనొప్పులు, ఆయాసం, క్యాన్సర్, కంటిశుక్లం, చూపు తగ్గడం, వినికిడి శక్తి తగ్గడం, నిరాశ, డిప్రెషన్, మధుమేహం, రక్తపోటు, మగవారిలో ప్రొస్టేట్ గ్రంథి వాపు, మెదడు, నాడీ మండల వ్యవస్థలో సమస్య కారణంగా చిత్తవైకల్యం, అజీర్ణం, మలబద్ధకం, నరాల అస్వస్థత, వణుకు, న్యూమోనియా, ఊపిరితిత్తుల సమస్యలు, చర్మం పొడిబారడం, నిద్రలేమి, అతి నిద్ర, పక్షవాతం, క్షయ, మహిళల్లో మూత్రం ఆపుకోలేని పరిస్థితి, మూత్ర మార్గం ఇన్‌ఫెక్షన్, గుండె జబ్బులు వస్తాయి.

వృద్ధాప్యంలో చురుగ్గా ఉండాలంటే..

- ముఖ్యంగా వ్యక్తిగత శుభ్రత పాటించాలి.
- రోజూ వాకింగ్, యోగా, పిల్లలతో లేదా తోటివారితో క్యారంబోర్డు, లూడో, చెస్ తదితర క్రీడలు ఆడాలి.
- సూర్యరశ్మి తగిలేలా తోటపని లేదా చిన్నచిన్న పనులు చేస్తుండడం మంచిది.
- కోరుకున్న ప్రదేశాలకు ప్రయాణించాలి.
- ఆసక్తి ఉన్న కళలు, చేతి పనులు చేయవచ్చు
- ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, ఇతర పోషకాహారం తీసుకోవాలి.
- ధూమ, మద్యపానానికి దూరంగా ఉండాలి
- మంచి నిద్ర అలవాటు చేసుకోవాలి.
- బయటకు వెళ్లినప్పుడు గుర్తింపు కార్డు వెంట తీసుకెళ్లాలి. కుటుంబసభ్యుల ఫోన్ నంబర్లు, అత్యవసర మందులు వెంట ఉంచుకోవాలి.
- స్నేహితులతో కలిసి ఇష్టమైన సామాజిక కార్యకలాపాల్లో పాల్గొనాలి.

వృద్ధుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



వృద్ధుల ఆరోగ్యం గురించి ప్రత్యేక శ్రద్ధ వహించాలని వైద్య సిబ్బందిని ఆదేశిస్తున్నాం. ఈ మేరకు వారికి సూచనలు, సలహాలు ఇస్తున్నాం. జిల్లాలో చాలా చోట్ల వృద్ధులకు ప్రత్యేక ఓపీ కొనసాగుతోంది. అన్ని చోట్లా ప్రత్యేక ఓపీ సేవలు అందేలా చర్యలు తీసుకుంటాం. స్పెషలిస్టు వైద్యులచే చికిత్స, అవసరమైన మందులు, ఫిజియోథెరపీ అందేలా చర్యలు చేపడతాం. –హేమలత, ఎన్‌సీడీ జిల్లా అధికారి, కర్నూలు

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు

కర్నూలు(సెంట్రల్): ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలు అర్జీల ద్వారా లేవనెత్తిన సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా జాయింట్ కలెక్టర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిర్దేశిత గడువులోగా అర్జీలను పరిష్కరించాలని, ఏ ఒక్క ఫిర్యాదును నిర్లక్ష్యం చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటివరకు చూడని దరఖాస్తులు 15 ఉన్నాయని వాటిని వెంటనే పరిష్కరించాలన్నారు. రీఓపెన్ కాని అర్జీలు 22 ఉన్నాయని, ఇందులో రెవెన్యూకు సంబంధించి –12, పోలీసు –6, పంచాయతీరాజ్ –3 అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వీటికి సరైన ఎండార్స్‌మెంట్ ఇచ్చి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ఆఫీసు సబార్డినేట్, జూనియర్ అసిస్టెంట్ల వివరాలను డీఆర్వోకు అందజేయాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు.



జేసీ డాక్టర్ బి.నవ్యకు ఫిర్యాదు చేస్తున్న పత్తికొండ నియోజకవర్గ సర్పంచ్‌లు

ఇన్‌చార్జ్ డీఆర్వో చిరంజీవి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీల తీర్మానం లేకుండా పీఆర్ రోడ్ల పనులు

గ్రామ పంచాయతీల తీర్మానం లేకుండానే టీడీపీ నాయకులు పీఆర్ రోడ్ల పనులు చేపడుతున్నారని, ఇది గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి విరుద్ధమని మద్దికెర సర్పంచ్ సుహాసిని, దూదేకొండ సర్పంచ్ రెహమాన్, ఆర్.మండగిరి సర్పంచ్ ప్రభాకరరెడ్డి, పెరవళి సర్పంచ్ కె.మల్లికార్జున, చిన్నహుల్తి సర్పంచ్ కేశవరెడ్డి తదితరులు ఫిర్యాదు చేశారు. గ్రామ పంచాయతీ చైర్మన్ హోదాలో సర్పంచ్ సంతకం కాకుండా కార్యదర్శి సంతకాలతో పనులకు పరిపాలన అనుమతులు ఇస్తున్నారని, ఆ పనుల బిల్లులను వెండర్ కోడ్ ఉన్న వారి పేరిట జమ చేసేందుకు చూస్తున్నారని చెబుతూ ఆవేదన వ్యక్తం చేశారు. అదే జరిగితే సర్పంచ్‌లు ఉత్సవ విగ్రహాలుగా మారిపోతారని, వెంటనే పంచాయతీ తీర్మానం లేకుండా మొదలు పెట్టిన పనులను రద్దు చేయాలని వారు కోరారు.

- ఆదోని మార్కెట్‌లో పత్తి వ్యాపారులు సిండికేట్‌గా మారి రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని, కనీస మద్దతు ధరకు కూడా పత్తిని కొనుగోలు చేయడం లేదని, పత్తి కొనుగోళ్లను సీసీఐ ఆధ్వర్యంలో చేపట్టాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు.
- సమగ్ర శిక్షలో 12 సంవత్సరాలుగా పనిచేస్తున్న పార్ట్‌టైం, క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్లను 2024–25 సంవత్సరానికి రెన్యువల్ చేయాలని ఏపీ సమగ్ర శిక్షా అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ విన్నవించారు.

ఫిర్యాదుల వెల్లువ

కర్నూలు (టౌన్): ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ఫిర్యాదులను నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక నగరపాలకలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. నగరంలోని వివిధ కాలనీలకు చెందిన 24 మంది తమ అర్జీలు కమిషనర్‌కు అందజేశారు. అదనపు కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ, ఆరోగ్యశాఖ అధికారి విశ్వేశ్వరరెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ఎస్ఈ రాజశేఖర్, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఎంఈ సత్యనారాయణ, టీపీఆర్వో వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

వచ్చిన అర్జీల్లో కొన్ని..

- టిడ్కో గృహాలకు సంబంధించి అనర్హత రావడంతో తాము చెల్లించిన డీడీని రీఫండ్ చేయాలని పలువురు వినతి పత్రాలు అందజేశారు.
- జొహరాపురానికి వెళ్లే రహదారిలో మెటల్ రోడ్డు నిర్మించాలని గణేష్ నగర్–2 వాసులు సత్యనారాయణ, చంద్రశేఖర్ విన్నవించారు.
- నెహ్రూ, ఆటో నగర్‌లలో మురుగుకాల్వలు నిర్మించాలని ఆ కాలనీవాసులు నిజాముద్దీన్, కరుణాకర్ బాబు అభ్యర్థించారు.
- గోకారి నగర్‌లో రహదారులు, మురుగు కాల్వలు, నీటి వసతి వంటి మౌలిక వసతులు కల్పించాలని సీపీఐ న్యూ డెమోక్రసీ పార్టీ నాయకులు వెంకటస్వామి విన్నవించారు.
- తాగునీటి పైప్‌లైన్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ఒమేగా హాస్పిటల్ వద్ద ఉన్న శ్రీవారి సుదర్శనం కాలనీవాసులు రఘునాథ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి ఫిర్యాదు చేశారు.
- మారుతీ నగర్‌లోని పెద్ద వంకపై కల్వర్టులు, రహదారులు, డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టాలని స్థానిక వాసులు రాధాకృష్ణ, రామాచారి, సత్తయ్యలు వినతిపత్రం అందజేశారు.



కమిషనర్ రవీంద్రబాబుకు సమస్యను వివరిస్తున్న కాలనీవాసులు

సీఎం, డిప్యూటీ సీఎం రాజీనామా చేయాలి

- కూటమి నేతల వ్యాఖ్యల వల్లే వేంకటేశ్వర స్వామి భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయి
- తిరుమల లడ్డూ కల్తీ ఆరోపణలపై సుప్రీం కోర్టు వ్యాఖ్యలు చంద్రబాబుకు చెంపదెబ్బ
- సిట్‌ను రద్దు చేసి సీబీఐ విచారణ జరిపించాలి
- వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత మద్దూరు సుభాష్ చంద్రబోస్ డిమాండ్

కర్నూలు (టౌన్): తిరుమల వేంకటేశ్వరస్వామి దివ్య ప్రసాదం లడ్డూ కల్తీ ఆరోపణలపై సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలకు బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ వెంటనే రాజీనామా చేయాలని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్ డిమాండ్ చేశారు. సోమవారం సాయంత్రం స్థానిక సి.క్యాంపులోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. పవిత్రమైన తిరుమల లడ్డూ కల్తీ జరిగిందంటూ ఆధారాలు లేకుండా, విచారణ జరిపించకుండా, గుడ్డిగా మాట్లాడితే భక్తుల మనోభావాలు దెబ్బతింటాయన్న కనీస బాధ్యత లేదా? అని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబునాయుడు లడ్డూ ప్రసాదం కల్తీ జరిగిందంటూ నిరాధార ఆరోపణలు చేశారని, ఆ వ్యాఖ్యలకు తందానా అంటూ సున్నితమైన అంశాన్ని పెద్దది చేస్తూ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రాయశ్చిత్త దీక్షలంటూ ఓవరాక్షన్ చేసి తిరుమల పవిత్రతను మంట గలిపారన్నారు. లడ్డూ కల్తీ ఆరోపణలపై సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు కూటమి నేతలకు చెంప దెబ్బలాంటిదన్నారు. అనాలోచితంగా చంద్రబాబు చేసిన వ్యాఖ్యల వల్ల ప్రపంచవ్యాప్తంగా ఉన్న వేంకటేశ్వరస్వామి భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. సుప్రీంకోర్టు వ్యాఖ్యలను బట్టి కేవలం రాజకీయ లబ్ధి కోసమే చంద్రబాబు దుర్మార్గమైన ఆరోపణలు చేశారని తేలిపోయిందన్నారు. తొందరపాటు ఆరోపణలపై భక్తులకు క్షమాపణలు చెప్పాలని, వాస్తవాలను ప్రజలకు తెలియజేసేందుకు సీబీఐ లేదా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి చేత విచారణ జరిపించాలన్నారు.



మాట్లాడుతున్న సుభాష్ చంద్రబోస్

విధుల్లో చేరిన ఎక్సైజ్ సీఐలు

కర్నూలు: కర్నూలు ఎక్సైజ్ స్టేషన్ సీఐగా నియమితులైన కె.చంద్రహాస్ విధుల్లో చేరారు. కడప జిల్లాకు చెందిన ఈయన 2007లో ఎస్ఐ హోదాలో ఎక్సైజ్ శాఖలో చేరి అనంతపురం, కడప, కర్నూలు జిల్లాల్లో పనిచేశారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా కర్నూలు ఎక్సైజ్ స్టేషన్‌కు నియమితులయ్యారు. అలాగే ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో రాజశేఖర్ గౌడ్, జయరాంనాయుడు, సుభాషిణి, డీటీఎఫ్‌లో రాజేంద్రప్రసాద్, ఏఈఎస్‌గా రామకృష్ణారెడ్డి తదితరులు సోమవారం విధుల్లో చేరారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న చంద్రహాస్

మద్యం పట్టివేత : కర్నూలు శివారులోని మునగాలపాడు అండర్ బ్రిడ్జి వద్ద వాహన తనిఖీల్లో తెలంగాణ మద్యం పట్టుబడింది. కర్నూలు స్టేషన్ సీఐ చంద్రహాస్ ఆధ్వర్యంలో సోమవారం వాహన తనిఖీలు చేపట్టారు. అలంపూరు వైపు నుంచి కర్నూలుకు వస్తున్న ఆటోను తనిఖీ చేయగా 50 మద్యం బాటిళ్లు బయట పడ్డాయి. ఆటోతో పాటు మద్యాన్ని సీజ్ చేసి కర్నూలు పాతబస్తీలోని దండిగేరికి చెందిన కురువ అశోక్‌కుమార్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

కర్నూలు (టౌన్): నగరంలో పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వర్తించాలని నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు సిబ్బందిని హెచ్చరించారు. సోమవారం స్థానిక అశోక్‌నగర్, వెంకటరమణ కాలనీ, లేబర్ కాలనీలలో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. పారిశుద్ధ్య సిబ్బంది, సచివాలయాల సిబ్బందికి సూచనలు చేశారు. జనావాసాల మధ్య ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలను తొలగించాలని, ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించాలని ఆదేశించారు. నగరపాలక ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వరరెడ్డి ఉన్నారు.

విజేతలకు అభినందన

కర్నూలు సిటీ: రాయలసీమ యూనివర్సిటీ స్థాయిలో నంద్యాల శ్రీరామకృష్ణ డిగ్రీ కాలేజీలో నిర్వహించిన షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంటు పోటీల్లో శంకరాస్ డిగ్రీ కాలేజీ విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా సోమవారం ఆ కాలేజీలో నిర్వహించిన కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ బి.హరికిషన్ విజేతలను అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు.

స్కీం వర్కర్లను రెగ్యులర్ చేయాలి

కర్నూలు(సెంట్రల్): వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న స్కీం వర్కర్లను రెగ్యులర్ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పీఎస్ రాధాకృష్ణ, ఎండీ అంజిబాబు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి స్కీం వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

గణాంకాల సేకరణతోనే సామాజిక న్యాయం

కర్నూలు(అర్బన్): షెడ్యూల్డు కులాల గణాంకాల సేకరణ ద్వారానే ఎస్సీ ఉప కులాలకు సామాజిక న్యాయం దక్కుతుందని మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు బైరాపురం రాజు మాదిగ అన్నారు. రాష్ట్రపతి ఆమోదించిన గెజిట్‌లో ఉన్న 59 షెడ్యూల్డు కులాల గణాంకాలను ఈ ఏడాది డిసెంబర్ చివరి నాటికి పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. కులగణన చేయాలనే డిమాండ్‌పై సోమవారం ఎంఆర్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయ మాదిగ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామ సచివాలయంలో షెడ్యూల్డు కులాల ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. తద్వారా విద్య, ఉద్యోగ రిజర్వేషన్లు అన్ని కులాలకు వర్తింపజేసేందుకు వీలవుతుందన్నారు. ఎంఆర్‌పీఎస్ జిల్లా నాయకులు గూడూరు ప్రతాప్, మీసాల బాబు, విహార్, పైగేరి మధు, రాజశేఖర్, జయన్న, దాస్, సుజాతమ్మ, అయ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎంఎస్ఎఫ్, ఎంఆర్‌పీఎస్ నేతలు

సొసైటీలో అక్రమాలను వెలికితీయాలి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నాలుగో తరగతి ఉద్యోగుల సొసైటీలోని అక్రమాలను వెలికి తీసేందుకు విచారణ కమిటీని ఏర్పాటు చేయాలని ప్రజా పరిరక్షణ సమితి డిమాండ్ చేసింది. సోమవారం ఆ సమితి ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. సమితి నాయకులు బలరాం, రవికుమార్‌రెడ్డి, రవికుమార్ పాల్గొన్నారు.

జాబ్‌మేళాతో ఉద్యోగావకాశాలు

కర్నూలు(సెంట్రల్): నిరుద్యోగ యువత జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకుని ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో జాబ్‌మేళా పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు. జేసీ మాట్లాడుతూ అక్టోబర్ 4న ఎమ్మిగనూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉదయం 9.30 గంటల నుంచి జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ మేళా ద్వారా 17 ప్రైవేట్ కంపెనీలు 950 మందికి ఉద్యోగాలు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఆసక్తి కలిగిన 18 – 45 వయస్సుగల వారు www.skilluniverse.apssdc.in వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 77994 94856, 96427 35717 ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చన్నారు. ఇన్‌చార్జి డీఆర్వో చిరంజీవి, ఉపాధి కల్పన అధికారి దీప్తి, నైపుణ్యాభివృద్ధి, శిక్షణ అధికారి ఎల్.ఆనంద్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

నగరం కంపు కొడుతున్నా పట్టదా?



మున్సిపల్ అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు (టౌన్): రెండు గంటల పాటు సమీక్ష చేశా.. ప్రతి అంశాన్ని నమోదు చేసుకోవాలని చెప్పా.. ఇప్పటికే నగరం కంపు కొడుతోంది.. పరిష్కార మార్గాలు లేవా? అని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ మున్సిపల్ అధికారులను ప్రశ్నించారు. సోమవారం సాయంత్రం స్థానిక ప్రభుత్వ అతిథి గృహంలో మంత్రి మున్సిపల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. మంచినీరు, ట్రాఫిక్ సమస్య, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు, మాస్టర్ ప్లాన్ ప్రకారం రోడ్ల ఏర్పాటు తదితర అంశాలపై చర్చించారు. మంత్రి మాట్లాడుతూ.. నగరాభివృద్ధికి అన్ని శాఖల సమన్వయంతో ప్రణాళికను రూపొందించుకుని ముందుకెళ్దామన్నారు. తాగునీటి సమస్య పరిష్కారం, బుధవారపేటలో పార్కు ఏర్పాటు, కేఈ మాదన్న నగర్ పాత డంపింగ్ యార్డు వద్ద గ్రీనరీని పెంచాలని సూచించారు. జగన్నాథగట్టు టిడ్కో ఇళ్ల వద్ద అంగన్‌వాడీ కేంద్రం, అర్బన్ హెల్త్ సెంటర్, పాఠశాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. సుద్దవాగుకు రక్షణ వలయం ఏర్పాటు చేయాలని, నగరంలో ఆక్రమణలను తొలగించాలని ఆదేశించారు. సంకల్‌బాగ్, రాజ్‌విహార్, ఎల్లమ్మ దేవాలయం నుంచి పాతబస్తీ వైపు వెళ్లే విధంగా బండ్ రహదారి నిర్మాణ పనులు చేపట్టాలని చెప్పారు. బిర్లా కాంపౌండ్ అండర్ రైల్వే బ్రిడ్జి కింద మురుగు నీరు నిల్వ ఉండకుండా శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. వీధి కుక్కల బెడద తగ్గించాలని, పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలన్నారు. నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు, అదనపు కమిషనర్ కృష్ణ, ఆరోగ్య అధికారి విశ్వేశ్వరరెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఎస్ఈ రాజశేఖర్, ఎంఈ సత్యనారాయణ, మేనేజర్ చిన్నరాముడు పాల్గొన్నారు.

భగవద్గీత కంఠస్థ పోటీలు

కర్నూలు కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో గీతా జయంతి పురస్కరించుకొని విద్యార్థులకు భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీలు నిర్వహించనున్నట్లు టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి తెలిపారు. ఈ ఏడాది శ్రీమద్ భగవద్గీత ఆత్మ సంయమ యోగం 6వ అధ్యాయంపై పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. 6, 7 తరగతుల విద్యార్థులు మొదటి గ్రూప్‌గాను, 8, 9 తరగతుల వారు రెండవ గ్రూప్‌గాను, 16 నుంచి 18వ సంవత్సరాల వయసు గలవారు మూడవ గ్రూప్‌గాను, 18 ఏళ్లు నిండిన వారిని నాలుగవ గ్రూప్‌గా విభజించి పోటీలు నిర్వహించడం జరుగుతుందని వివరించారు. పోటీల తేదీలను త్వరలోనే ప్రకటిస్తామని, వివరాలకు 90598 02265 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

సీనియర్ సిటిజన్లకు నేడు వైద్య శిబిరం

కర్నూలు(అర్బన్): స్థానిక ఏ క్యాంప్ మాంటిస్సోరి స్కూల్‌లో మంగళవారం ఉదయం 11 గంటలకు ప్రపంచ వయో వృద్ధుల దినోత్సవం నిర్వహించనున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు రయిస్ ఫాతిమా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే సీనియర్ సిటిజన్లకు మెడికల్ క్యాంప్ నిర్వహించనున్నట్లు తెలిపారు.